తేదీ 30.3.2006, సాయికుల్వంత్ సభామండపం

# మంచినే చూడు, మంచినే చేయి, మంచిగా ఉండు

ద్రుపద మహారాజు తన కుమార్తెకు స్వయంవరము ఏర్పాటు చేశాడు. ఏరీతిగానైతే జనక మహారాజు శివధనుస్సు నెక్కుపెట్టగల్గిన వీరునికి సీతనిచ్చి వివాహము చేస్తానని ప్రకటించాడో అదేరీతిగా ద్రుపద మహారాజు మత్స్యయంత్రమును కొట్టిన వీరునికి తన కుమార్తెనిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు. మత్స్యయంత్రము అనగా ఏమిటి? క్రింద నీరుంటుంది. పైభాగంలో ఒక చేప తిరుగుతూ ఉంటుంది. నీటిలో నీడ చూసి పైన తిరిగే మత్స్యమును కొట్టాలి. ఇది అంత సులభం కాదు; సామాన్యులకు సాధ్యమయ్యే పని కాదు. అయితే, ద్రుపద రాజపుత్రిని పెండ్లాడాలని రాజులు, రాకుమారులు, యువకులు వేలకొలది స్వయంవరమునకు ఏతెంచారు. మారువేషములో వచ్చిన పంచపాండవులుకూడా ఆ సభలో ఉన్నారు. ఆ స్వయంవరములో విజయము సాధించగలమనే ధైర్యం గల మహావీరులు, శూరులు ముందుకు వచ్చి మత్స్యయంత్రమును కొట్టడానికి ప్రయత్నం చేశారు. కాని, ఎవ్వరికీ సాధ్యం కాలేదు. కట్టకడపటికి సభ అంతయు స్తంభించిపోయింది. అప్పుడు కృష్ణుడు పాండవులవైపు తన దృష్టి మరల్చి చిరునవ్వు నవ్వాడు. పాండవులు తమలో తాము గుసగుసలాడుకొని అర్జునుని లేపారు. శాంతస్వభావుడు, నెమ్మదస్తుడు అయిన అర్జునుడు లేచి చిరునవ్వుతో గంభీరముగా అడుగులు వేస్తూ మత్స్యయంత్రము వద్దకు వచ్చాడు. ధనుస్సును చేబట్టి నీటిలోకి చూస్తూ పైకి అంబును వదలి యంత్రాన్ని అవలీలగా కొట్టాడు. ఈ దృశ్యాన్ని తిలకించి ప్రజలు హర్షధ్వానాలు చేశారు. తండ్రి ఇచ్చిన పూలమాలను ద్రౌపది అర్జునుని మెడలో వేసింది.

srisathyasaivachanamrutam

## తేదీ 30.3.2006, సాయికుల్వంత్ సభామండపం

ద్రౌపదిని వెంటబెట్టుకొని పాండవులు ఇంటికి వెళ్ళేసరికి తల్లి తలుపులు వేసుకొని లోపల ఉండినది. 'అమ్మా! మేమొక గొప్ప విలువైన, మధురమైన ఫలమును తెచ్చాము', అన్నారు. అప్పుడు కుంతీదేవి, 'నాయనలారా! అంత గొప్ప ఫలమును మీరు ఐదుగురూ సమానంగా పంచుకోండి', అని చెప్పింది. ఎటువంటి పరిస్థితిలోనైనా తల్లి మాటను జవదాటనటువంటి ఆ బిడ్డలు లోపలికి వెళ్ళి తల్లికి నమస్కరించి, 'తల్లీ! నీ ఆజ్ఞను శిరసావహిస్తాము', అన్నారు. ఈవిధంగా, పంచ పాండవులు ద్రౌపదిని పరిణయమాడడం జరిగింది. ఐతే, దీనిని ప్రపంచం ఏవిధంగా అంగీకరిస్తుంది? ప్రపంచము అంగీకరించినా, అంగీకరించకపోయినా తల్లి ఆజ్ఞను శిరసావహించడం తమ కర్తవ్యమని భావించారు, పాండవులు. వారిమధ్య ఉన్నటువంటి సన్నిహిత సంబంధ బాంధవ్యమును గుర్తించినటువంటి వారు దీనిని సమర్థిస్తూవచ్చారు. కాని, కొందరు కృష్ణుని ప్రశ్నించారు, 'ఐదుమంది భర్తలను కలిగిన ద్రౌపది పతివ్రత ఎట్లవుతుంది?' అని. కృష్ణుడు చెప్పాడు,

**"పతుల పలుమాటలకు బదుల్చెప్పబోదు**
**వారి సేవలు చేయగా తీరదనదు**
**తనకు కలదానిచే తృప్తి గనుచునుండు**
**ద్రౌపదికి సాటి యే పతివ్రతయు లేదు."**

పతియొక్క స్థితిగతులను గుర్తించి వర్తించడం పతివ్రత లక్షణం. భర్తకు నూరు రూపాయల జీతం వస్తుంటే తనకు ఇన్నూరు రూపాయల చీర కావాలని ఆమె కోరదు. తనకున్నదానితో తృప్తిపడుతుంది.

ద్రౌపదియొక్క ఆదర్శవంతమైన ప్రవర్తనను, గుణగణములను చక్కగా గుర్తించినటువంటి ధర్మజుడు, 'ద్రౌపదీ! నీవు ప్రకృతిని పరిపాలించే సామర్థ్యము గల శక్తిస్వరూపిణివి. నీలో ఉన్న పంచేంద్రియములను, పంచభూతములను అరికట్టుకున్నదానివి. నీవంటివారే ఈ ప్రపంచముయొక్క స్థితిగతులను చక్కగా గుర్తించి

sri sathyasai vachanamrutam

చక్కదిద్దడానికి వీలవుతుంది", అని కొనియాడినాడు. ధర్మజుని ఆదేశము మేరకు ద్రౌపది ప్రజలయొక్క మంచిచెడ్డలను పరిశీలన చేస్తూవచ్చింది. ప్రపంచంలో చీకటి వెలుగుల మాదిరి కొంత మంచి, కొంత చెడు రెండూ ఆమెకు కనిపిస్తూ వచ్చాయి. చెడ్డ గుణములు గలవారికి సద్బోధలూ చేస్తూ, మంచివారికి ఉత్సాహ ప్రోత్సాహములందిస్తూ ఆమె రాజ్యాన్ని చక్కదిద్దుటకు కృషి చేస్తూ వచ్చింది. "ప్రజలారా! మీరు మీ కర్తవ్య కర్మలను చక్కగా నిర్వర్తించండి. కామ, క్రోధాది అరిషడ్వర్గములను అరికట్టుకోండి", అని బోధలు సల్పుతూ వచ్చింది. కామమనగా కోరిక అని అర్థము. కోరికలను మనం అరికట్టుకోవాలి. ఏది మంచిది? ఏది చెడ్డది? అనే విచారణ చేసి మంచిని మాత్రమే స్వీకరించి, చెడ్డను విసర్జించాలి. ఇదే సరియైన సాధన. నీ కోరికను నెరవేర్చుకునే నిమిత్తం నీ కర్తవ్యాన్ని, నీ సహజధర్మాన్ని విస్మరించడం సరియైన పద్ధతి కాదు. నీకు భార్య ఉండనీ, బిడ్డలు కల్గనీ. ఐతే, వారిపట్ల నీకు గల బాధ్యతలను నీవు సక్రమంగా నిర్వర్తించాలి. నీ కోరికలను నీవు సత్యమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. ఈరీతిగా ద్రౌపది ప్రజలకు సన్మార్గమును బోధిస్తూ, ఆదర్శప్రాయురాలిగా నిలిచింది. స్త్రీలుగాని, పురుషులుగాని ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వర్తించాలి. ఒకరి కర్తవ్యములో మరొకరు ప్రవేశించకూడదు. భార్యా భర్తలు తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తిస్తూ సత్యమార్గములో నడవాలి. మనము సత్యాన్ని అనుసరించి నడుచుకున్నప్పుడు అదే ధర్మముగా రూపొందుతుంది. "సత్యాన్నాస్తి పరోధర్మః". సత్యమును వదలి ధర్మము ఎక్కడా కనిపించదు. భగవంతుడు తాను ఏది చేసి నప్పటికీ సత్య, ధర్మములను ఆధారం చేసుకుంటాడు.

**దమమును సాధించినవాడే అభివృద్ధికి రాగలడు**

ప్రతి వ్యక్తీ తన కర్తవ్యాన్ని, తన సహజ ధర్మాన్ని అనుసరించాలి. చీమలుకూడా తమ సహజ ధర్మాన్ని చక్కగా పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నవి. అవి తమకు కావలసిన ఆహారము ఎక్కడ దొరుకుతుందో అక్కడికి వెళతాయి. తమకు తగినంత ఆహారమును తమ స్వస్థానమునకు తెచ్చుకొని భుజిస్తాయి. అవి ఇంకొకరి వస్తువును అపహరించవు; ఇంకొకరికి అపకారము చేయవు. పరస్పరం ఎంతో ప్రేమతో, ఐకమత్యముతో తమ జీవితాన్ని గడుపుతూ ఉంటాయి. చీమలన్నీ లైనుగా పోతుంటే మీరు గమనించి చూడండి.

srisathyasaivachanamrutam

**తేదీ 30.3.2006, సాయికుల్వంత్ సభామండపం**

ఒక చీమను ఎదురుగా వస్తున్న మరొక చీమ పలుకరించి, ముద్దుపెట్టి ముందుకు సాగిపోతుంటుంది. చీమలలో కూడా ఎంతో దమము ఉంటుండాది. దమము అనగా ఇంద్రియ నిగ్రహము. కాని, ఈనాటి మానవుడు ఇంద్రియ నిగ్రహమును కోల్పోయి, కామక్రోధాది అరిషడ్వర్గములకు లొంగిపోయి దానవునివలె ప్రవర్తిస్తున్నాడు. కామ, క్రోధాదుల వలన కలిగే దుష్పరిణామాలనుగురించి ద్రౌపది ప్రజలను హెచ్చరిస్తూ వచ్చింది. క్రోధము మానవత్వానికే విరుద్ధమైనది. మనము అనవసరంగా అందరిపైన క్రోధాన్ని ప్రదర్శించకూడదు.

**తన కలిమి భంగపుచ్చును**
**తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్**
**తనవారల కెడ సేయును**
**జనులకు కోపంబువలన సర్వంబు చెడున్**

**కోపము కలిగినవానికి**
**ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్**
**పాపపు పనులను చేయుచు**
**ఛీ! పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!**

కోపమును ఎక్కడ, ఏవిధంగా ఉపయోగించాలనే విషయాన్ని చక్కగా గుర్తించి వర్తించాలి. ఎవరిపై కోపం చూపాలి? ఎవరిని ద్వేషించాలి? నీకు అయిష్టమైన వారిని ద్వేషించవలెనా? నీకు అపకారము చేసినవారిని ద్వేషించవలెనా? నీకు విరోధి అయినటువంటివాడిని ద్వేషించవలెనా? కాదు, కాదు. దుర్గుణములను నీవు ద్వేషించాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను కాపాడేవారిని నీవు ప్రేమించాలి. సత్య, ధర్మములను నీవు ద్వేషించితివంటే, నీవు మానవుడవే కాదు. మనసుతోగాని, మాటతోగాని, చేతలతోగాని నీవు హింసకు పాల్పడకూడదు. ఎవ్వరికీ అపకారము చేయకూడదు. అన్నిటికీ మూలాధారమైన సత్యమును అనుసరించడంద్వారా ధర్మమును, శాంతిని, ప్రేమను అనుభవిస్తూ వచ్చింది, ద్రౌపది. ఆమెవలె సత్యమును అనుసరించి లోకానికి ఆదర్శంగా నిలిచిన మరో సాధ్వీమణి దమయంతి. దమయంతి అనగా దమమును సాధించినటువంటిది. దమమును

srisathyasaivachanamrutam

సాధించినప్పుడే మానవుడు ఎంతైనా అభివృద్ధికి రాగలడు. దమమును సాధించాలంటే ఇంద్రియాలను కంట్రోలు చేసుకోవాలి. మన ఇంద్రియాలు ఇష్టమొచ్చినట్లుగా తిరుగుతుంటాయి. భగవంతుడు మనకు చెవుల నిచ్చినది ఎందుకోసం? వారి మాటలూ, వీరి మాటలూ వినడంకోసమా?! చెడ్డ మాటలేవీ వినకూడదు. మంచి మాటలు మాత్రమే వినాలి.

**"నాలుక నిచ్చినదెందుకొ తెలుసా?**
**మాటలు పలికేటందులకా? కాదు, కాదు.**
**ఆర్తావనుడౌ దేవదేవుని కీర్తనలు పాడేటందుకురా!"**

మనము భుజించే ఆహారాన్ని నాలుక రుచి చూసి మంచిగా ఉంటే లోపలికి పంపుతుంది; లేకపోతే బయటికి ఉమ్మేస్తుంది. అదేరీతిగా, ఇంద్రియములద్వారా మనము మంచిని మాత్రమే స్వీకరించాలి; చెడును విసర్జించాలి.

**భగవంతుడు సాక్షీభూతుడు**

భగవంతుడు కొందరికి కష్టము నిస్తున్నాడనీ, కొందరికి సుఖము నిస్తున్నాడనీ మీరనుకుంటారు. కష్టముగాని, సుఖముగాని ఎవరి కర్మను అనుసరించి వారు అనుభవిస్తున్నవేగాని, భగవంతుడు అందించినవి కావు. భగవంతుడు ఎందులోనూ ప్రవేశించడు. తాను కేవలం సాక్షీభూతుడు. దుఃఖానికీ బాధ్యుడు కాదు; సుఖానికీ బాధ్యుడు కాదు. నీవు నీ ఎదుటి వ్యక్తిని, 'మిత్రమా! బాగున్నావా?' అని ప్రేమగా పలుకరిస్తే, అతనుకూడా 'బాగున్నాను మిత్రమా! నీవెలాగున్నావు?' అని నిన్ను ప్రేమగా పలుకరిస్తాడు. నీవు దురుసుగా మాట్లాడితే, అతనుకూడా నీకు దురుసుగా సమాధానం చెపుతాడు. మాటకు మాట, చూపుకు చూపు! మనము ఏవిధమైన 'యాక్షన్' (చర్య) చేస్తామో అదేవిధమైన 'రియాక్షన్' (ప్రతిచర్య) మనకు తిరిగి వస్తుంది. 'రియాక్షన్, రీసౌండ్, రిఫ్లెక్షన్' (ప్రతిచర్య, ప్రతిధ్వని, ప్రతిబింబము) ఈ మూడూ ఎవరికి వారు కల్పించుకున్నవేగాని, భగవంతుడు అందించినవి కావు. అద్దం ముందు నిలబడి నీవు ఏవిధమైన హావభావాలను ప్రదర్శిస్తావో నీ ప్రతిబింబము నీకు ఆవిధంగానే కనిపిస్తుంది. సభలో నిలబడి నీవు ఏ పలుకులు పలుకుతావో ఆ పలుకులే తిరిగి నీకు 'రీసౌండు'గా వినిపిస్తాయి. నీ మనస్సు ఏ

srisathyasaivachanamrutam

## తేదీ 30.3.2006, సాయికుల్వంత్ సభామండపం

తలంపులు తలుస్తుందో వాటి 'రిఫ్లెక్షనే' నీకు బయటినుండి వస్తుంది. కనుక, మొదట నీవు చేసే పనుల మంచిచెడ్డలను విచారించు. 'ఇది చెడ్డది' అని నీకు తోచినప్పుడు దానిని చేపట్టవద్దు. ఆవిధంగా నడుచుకున్నప్పుడే నీవు నిజమైన భక్తునివవుతావు, ముక్తునివవుతావు.

**"ఎవరు చేసిన కర్మ వారనుభవింపక**
**ఏరికైనను తప్పదన్నా!**
**ఏనాడు ఏతీరు ఎవరు చెప్పాగలరు?!**
**అనుభవించుట సిద్ధమన్నా!**
**రాముడంతటివాడు రమణి సీతను బాసి**
**పామరునివలె ఏడ్చెనన్నా!"**

మనం అనుభవించే మంచిచెడ్డలన్నీ మనం చేసిన కర్మల ఫలితములేగాని వేరు కావు. మంచిచెడ్డలనేవి మనసులోనే ఉన్నాయిగాని, మరోదానియందు లేవు. నీవు చెడ్డను పెరికిపారవేయవలసిన అవసరం లేదు. చెడ్డను మరచిపోతే మంచి నీలో అభివృద్ధి అవుతుంది.

**మనము చేసినవే తిరిగి మనకు వస్తున్నాయి**

యువకులారా! మీకందరికీ ముఖ్యంగా ఈనాడు నేను చెప్పదలచుకున్నది ఇదే. ఈనాడు నూతన సంవత్సరం ప్రారంభమైందనీ, ఇది నూతనమైన ఫలితాల నందిస్తుందనీ మీరు భావించరాదు. మీకు లభించే ఫలితాలు మీ గుణములపైన, మీ ప్రవర్తనపైన ఆధారపడి ఉంటాయి. దీనికొక చిన్న ఉదాహరణ: ఒక పశువుల కాపరి పశువులను తోలుకొని మూడు కొండల మధ్యకు వెళ్లాడు. అక్కడ పశువులు గడ్డి మేస్తుంటే తానొకచోట కూర్చుని గట్టిగా పాట పాడుకుంటున్నాడు. అది కొండప్రాంతం కావడంచేత ఆ పాట తిరిగి తనకు వినిపిస్తోంది. అది తాను పాడే పాటయొక్క ప్రతిధ్వని అనే విషయాన్ని గ్రహించలేక ఆ అమాయకుడు, 'ఎవడు వాడు? నా స్వరమును అనుకరించి నేను పాడిన పాటనే పాడుతున్నాడు' అనుకున్నాడు. 'ఎవరు నీవు?' అని గట్టిగా అరిచాడు. ఎక్కడినుండో మరల 'ఎవరు నీవు?' అనే పలుకులే వినవచ్చాయి. అతనికి కోపం వచ్చింది. ఇంటికి వెళ్లిన

sri sathyasai vachanamrutam

తరువాత ఆరోజు భోజనం చేయలేదు. “ఎందుకురా నాయనా కోపంగా ఉన్నావు?” అని తల్లి ప్రశ్నించగా, “అమ్మా! ఈరోజు నేను పశువులను మేపడానికి వెళ్ళిన చోట నాకొక విరోధి ఉన్నాడు. వాడు నేను పాడినట్లే పాడుతూ నన్ను గేలి చేస్తున్నాడు. వానిని ఎలాగైనా శిక్షించాలి”, అన్నాడు. మరునాడు పిల్లవాని వెంట తల్లికూడా వెళ్ళింది. అక్కడ జరిగిన సంగతి గ్రహించి పిల్లవాని అమాయకత్వానికి నవ్వుకొని, “నాయనా! ఇక్కడ నీకు విరోధి ఎవరూ లేరు. నీవు పాడిన పాటయొక్క ప్రతిధ్వనియే నీకు వినిపిస్తోంది”, అని వివరించింది. ఈ ప్రపంచములో మనము అనుభవించేదంతా అంతే! మనము చేసినవే తిరిగి మనకు వస్తున్నాయి; చేయనివి రావడానికి వీల్లేదు. ఇది భగవంతుని నియమం. ప్రేమ గలవాడు ద్వేషాన్ని కూడా ప్రేమగా మార్చుకుంటాడు. ప్రేమ లేనివానికి అందరూ విరోధులుగానే కనిపిస్తారు. ప్రేమగాని, విరోధముగాని మనో కల్పితములే!

**మంచిచెడ్డలు రెండును కలసియుండు**
**వీని విడదీయ ఎవ్వరి వశము కాదు**
**చెడ్డను ప్రత్యేకముగ నెందు చూడబోము...**

మీలో ఉన్నటువంటి భావములే మీకు బయట కనిపిస్తున్నాయి. మంచిగాని, చెడుగాని మీ గుణముల నుండి అభివృద్ధి అయ్యేటటువంటివేగాని, ప్రత్యేకంగా భగవంతుడు మీకు అందించేవి కావు. భగవంతుడు నిర్గుణుడు, నిరంజనుడు, సనాతనుడు. మీ భావములే మార్పుచెందుతుంటాయిగాని, భగవంతునిలో ఎట్టి మార్పూ ఉండదు. మీలో ఉన్నటువంటి భావములే తిరిగి మీకు 'రిఫ్లెక్షన్', 'రియాక్షన్', 'రీసౌండ్'లుగా వస్తున్నాయి. ఎవరో నిన్ను చూసి నవ్వారని కోపం తెచ్చుకుంటావు. అతను దేనికోసం నవ్వాడో నీకెట్లా తెలుసు?! ఒకనాడు 'కింగ్‌కాంగ్' తెల్లవారి లేస్తూనే రోడ్డుపైకి వెళ్ళి exercise (కసరత్తు) చేస్తున్నాడు. ఒక పల్లెటూరామె పాలు, పెరుగు తీసికొని అమ్మడానికి వస్తున్నది. ఆమె తనను చూసి నవ్విందని కింగ్‌కాంగ్ అపోహపడ్డాడు. 'ఏమి, నీవు నన్ను చూసి నవ్వుతావా! నేనెవరినో తెలుసా నీకు? నా బలమేమిటో తెలుసా?' అని కోపంగా ప్రశ్నించాడు. అప్పుడామె శాంతంగా, “అయ్యా! నేను నిన్ను చూసి నవ్వలేదు. నీవు మహా బలవంతుడవు. అత్యంత వేగంగా వెళ్ళే కారునుకూడా ఒక్క చేత్తో ఆపగల సమర్థుడవు. ఇంత గొప్ప బలవంతుడివై

srisathyasaivachanamrutam

యుండి ఒక స్త్రీ నిన్ను చూసి నవ్వెందనే అపోహతో నిగ్రహం కోల్పోతున్నావు. ఇంక నీకు ఎంత బలముండి ఏమి ప్రయోజనం?!" అన్నది.

**తనలోని దోషాలను గుర్తించి సరిదిద్దుకునేవాడే నిజమైన ముముక్షువు**

పిల్లల్లారా! మీ భావములు మంచివే. అయితే, కొన్నికొన్ని దృశ్యములు చూసి, కొన్నికొన్ని మాటలు విని మీ భావములలో మార్పు కలుగుతుంటుంది. నిజంగా చూస్తే ఈ ప్రపంచంలో మనిషి స్వరూపమే లేదు. మనిషి స్వరూపమే కాదు, అసలు ఏ రూపమూ లేదు. రూపములు ఉన్నవనుకొని మనము పేర్లు పెట్టుకొంటున్నామేగాని, నిజానికి ఏ రూపమూ లేదు. మన భ్రమయే దీనికంతటికీ కారణము. "నేను గొప్ప తెలివితేటలు గలవాడను, గొప్ప విద్యావంతుడను" అని మీరు అనుకుంటున్నారు. కాని, మీ తత్త్వాన్ని మీరు గుర్తించుకోలేనప్పుడు మీరు తెలివితేటలు గలవారెట్లవుతారు? తన తత్త్వాన్ని తాను గుర్తించుకున్నవాడే నిజమైన విద్యావంతుడు. మొట్టమొదట తనలోని దోషాలను తాను గుర్తించి సరిదిద్దుకోవాలి. అట్టివాడే నిజమైన ముముక్షువు.

మీరు దేవుని పూజించడంకంటే, దేవుని ప్రార్థించడంకంటే ముందు మీ మనసును అరికట్టుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఈ జగత్తునకంతటికీ మనసే మూలకారణం. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' బంధమోక్షములకు మనసే కారణం. శరీరాన్ని బంధించవచ్చుగాని, మనసును బంధించడం సులభం కాదు. కనుక, మొట్టమొదట మనసును బంధించండి. అప్పుడు ప్రపంచమంతా మీ హస్తగతమైపోతుంది. సిపాయిలు, తుపాకులు, బాంబులు ఇవన్నీ జగత్తును భస్మం చేయగలవుగాని, మనసును భస్మం చేయలేవు. మీరు ఆదర్శంగా నిలవాలంటే మనసుయొక్క తత్త్వాన్ని గుర్తించుకోండి. మనసును అరికట్టడానికి ప్రయత్నం చేయండి; తప్పక మీరు గొప్ప ఆదర్శప్రాయులు కాగలరు. తెలిసో తెలియకో మీరు కొన్ని పొరపాట్లు చేస్తారు. తప్పు తెలిసిన తర్వాత దానికి పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తము. పశ్చాత్తాపము లేకుండా మీరు పూజలు, వ్రతములు, యజ్ఞములు ఎన్ని చేసినా ప్రయోజనం లేదు. మొట్టమొదట మీ తప్పును గుర్తించుకొని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించండి. అదియే రాజమార్గము. మనుష్యజన్మ చాలా దుర్లభమైనది. మనిషి మనిషి కాదు; మాధవుడే! 'దైవం మానుష రూపేణ'. దైవమే

sri sathyasai vachanamrutam

మనుష్యరూపంలో వచ్చాడు. నీవు ఏ చెడ్డపని చేసినా దైవానివి కావు. నీకు ఏ చెడ్డ తలంపు వచ్చినా నీవు దైవానివి కావు. కాబట్టి, మొట్టమొదట నీవు మంచివాడవు కా! మంచినే చేయి. మంచినే చూడు. మంచిగా ఉండు. దైవత్వానికి మార్గమిదే.

**సర్వత్రా ఉన్నది భగవంతుడే!**

విద్యార్థులారా! మొట్టమొదట మనసును మీ స్వాధీనంలో పెట్టుకోండి. దానిని దైవానికి మాత్రమే అర్పితము చేయండి. అన్నీ తానే చూసుకుంటాడు. భగవంతుడు ఏదైనా చేయగలడు. కనుక, మీరు భగవద్భక్తిని అభివృద్ధి పరచుకోండి. సర్వత్రా ఉన్నది భగవంతుడే అని విశ్వసించండి.

“ఇందుగల డందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూసిన
అందందే గలడు....”

ఇదే విషయాన్ని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ తెలియజేశాడు:

**“సర్వతః పాణి పాదం తత్సర్వతోఽక్షి శిరో ముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి”**

భూమినుండి ఆకాశమువరకు సర్వత్రా నిండినవాడు భగవంతుడే! కాని, భౌతిక జీవులు ఈ సత్యాన్ని కనిపెట్టలేరు. చీమ, గ్రద్ద, పాము, తేలు, పులి, సింహము అన్నింటిలోనూ ఉన్నది నిర్గుణస్వరూపుడైన భగవంతుడే! ఇసుకలోనూ, చక్కెరలోనూ ఉన్నది భగవంతుడే! చీమలోనూ, బ్రహ్మలోనూ ఉన్నది ఒకే సత్యమే! కనుక, దైవభక్తితో మీ కర్తవ్య కర్మలను ఆచరిస్తూ రండి. మీరు నేర్చిన విద్యలను ఆచరణలో పెట్టి మంచిపేరు పొందండి. మీరు చదువుకోకూడదని నేనెప్పుడూ చెప్పడం లేదు. చదువవలసిందే. కాని, ఈ చదువు కేవలం లౌకికమైన ధర్మాన్ని బోధిస్తుంది. ఆధ్యాత్మికము అలౌకిక ధర్మాన్ని బోధిస్తుంది. పదార్థ పరిశోధనతో పాటు హృదయపరిశీలనకూడా అవసరం.

విద్యార్థులారా! మీరీనాడు విద్యాసంవత్సరం పూర్తి చేసుకొని ఇళ్లకు వెళుతున్నారు.

sri sathyasai vachanamrutam

పరీక్షా ఫలితాలు వచ్చిన తరువాత, 'నా నెంబరు వచ్చిందా లేదా' అని మీరు పేపరులో వెతుకుతుంటారు. అయితే, మీ నెంబరుకోసం మీరు వెతుకనక్కర్లేదు. 'నేను పరీక్షలు సరిగా వ్రాశానా లేదా' అని మీ హృదయాన్ని మీరు విచారించాలి. మీరు సరిగా వ్రాసి ఉన్నట్లయితే తప్పక పాసవుతారు. ఒకవేళ మీరు సరిగా వ్రాయకపోయినా పేపర్లో మీ నెంబరు కనిపిస్తే అది మీరు ఆనందించవలసిన విషయం కాదు. మీరు పరీక్షలో ఫస్టుక్లాసు సాధించడంతో సంతృప్తిచెందకూడదు. జీవితమనే పరీక్షలో మీరు 'నెంబర్ వన్'గా ఉత్తీర్ణులు కావాలి.

**ఇంద్రియ నిగ్రహంతోనే సుఖశాంతులు**

ప్రొద్దున్న మన డ్యాన్సు పిల్లలు 'రామయ్యవంటి కొడుకు కావాలని, సీతమ్మ వంటి బిడ్డ కావాలని...' అనే పాట పాడుతూ డ్యాన్సు చేశారు. రామయ్యవంటి కొడుకు కావాలంటే రామయ్యవంటి ధర్మము మనలో ఉండాలి. సీతమ్మవంటి బిడ్డ కావాలంటే సీతమ్మవంటి గుణము మనలో ఉండాలి. రావణునివంటి దుర్బుద్ధి, శూర్పణఖవంటి దుర్గుణములు మనలో ఉన్నప్పుడు రామయ్యవంటి కొడుకు, సీతమ్మవంటి బిడ్డ ఎలా కలుగుతారు?! ఎట్టి రూపము కావాలనుకుంటున్నామో అట్టి గుణము మనలో ఆవిర్భవించాలి. సహనము, శాంతము మొదలైన సద్గుణాలను అలవరచుకోవాలి. ఇంద్రియాల నరికట్టినప్పుడే మనకు peace (శాంతి) లభిస్తుంది. లేకపోతే జీవితము pieces (ముక్కలు) అవుతుంది. ఎవరేమి తిట్టిననూ, ఎవరేమి కొట్టిననూ నీవు శాంతంగా ఉండాలి. నీకై నీవు ఆ తిట్లతో 'కనెక్షన్' (సంబంధం) పెట్టుకుంటే అవి నీకు తగులుతాయి; లేకపోతే తగలవు. ఎవరో వచ్చి నిన్ను కొడతాడు. 'ఆ దేహము వచ్చి ఈ దేహాన్ని కొట్టింది. నన్ను కొట్టలేదు. నన్ను కొట్టడం ఎవరి తరమూ కాదు' – ఈవిధమైన భావము మనలో ఉంటే మనలను ఎవరు కొట్టినా, ఎవరు తిట్టినా వారిపైన మనకు క్రోధముగాని, ద్వేషముగాని కలుగదు. భగవంతునిపై దృఢమైన విశ్వాసంతో మనం అన్నింటికీ సిద్ధంగా ఉంటుండాలి.

**ప్రార్థిస్తే చాలదు; హృదయాన్ని అర్పించాలి**

భక్తురాలైన ద్రౌపది ఎన్ని విధములైన బాధలను అనుభవించవలసి వచ్చినప్పటికీ ఎంతో నిబ్బరముగా, శాంతముగా కృష్ణుని ఆరాధిస్తూ వచ్చింది. 'కృష్ణా! నిరంతరం నిన్నే



sri sathyasaivacharamrutam

ఆరాధిస్తున్నాను, ఆనందిస్తున్నాను. నాకు నీవు తప్ప మరొక దిక్కు లేదు. నాపై దయ చూపు. నీ దయ ఉంటే చాలు నాకు. ఇంకేదీ అక్కర్లేదు' అని ప్రార్థిస్తూ వచ్చింది. త్యాగరాజుకూడా, 'రామా! నేనెన్నివిధాలుగా ప్రార్థించినప్పటికీ నీకింకా నాపై దయ రాలేదేమిటి? నా సర్వస్వమును నీకు అర్పితం చేసి నీకు శరణాగతుడనైనాను. కరుణించి నన్ను కాపాడు', అని ప్రార్థించాడు. ఐతే, కేవలం కాపాడమని ప్రార్థిస్తే చాలదు; మీ హృదయాన్ని భగవంతునికి అర్పితం గావించాలి.

మనిషికి రూపమున్నది, నామమున్నది. కాని, ఆత్మకు రూపము లేదు, నామము లేదు. ప్రపంచంలో ఒక్కొక్కరు ఒక్కొక్క రూపమును, ఒక్కొక్క నామమును ఇష్టపడతారు. ఒకరు 'రామా!' అని ప్రార్థిస్తారు; మరొకరు 'కృష్ణా!' అంటారు. ఈవిధంగా ఎవరికి ఇష్టమైన రూపనామములను వారు పూజిస్తున్నారు. కొందరు రూపనామములను విశ్వసించకపోవచ్చు. ఆత్మకు రూపము లేదుగాని, అందరూ దానిని విశ్వసిస్తారు. 'నా ఆత్మయే నాకు సాక్షి' అని ప్రతి ఒక్కరూ అంటారు కదా! అందరికీ వర్తించే పేరు ఆత్మ. ఆత్మ అనేది రూపనామములకు అతీతమైన దైవత్వం. ఇట్టి ఆత్మతత్త్వాన్ని మనము చక్కగా విశ్వసించి ఆరాధిస్తే మనకు తప్పక దివ్యత్వము లభిస్తుంది.

**(తేదీ 30.3.2006, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasaivachanamrutam